AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM

3-7-2026 (Friday) MAIN EDITION

## కోదాడ రూరల్ ఎస్సైపై వేటు



**అక్షరటుడే, నల్గొండ :** సూర్యాపేట జిల్లాలో కోదాడ రూరల్ ఎస్ఐ గోపాల్‌పై వేటు పడింది. ఈ మేరకు పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాన్వాయ్‌ను షెడ్యూల్ రూట్‌లో కాకుండా మరో మార్గంలో ఎస్సై గోపాల్ తీసుకెళ్లారు. ఈ ఘటనపై డీజీపీకి స్వయంగా డిప్యూటీ సీఎం ఫిర్యాదు చేశారు. జోనల్ 2 ఐజీ, సూర్యాపేట ఎస్పీలను వివరణ కోరారు. ఎస్సై వ్యవహారంపై డిప్యూటీ సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎస్సై గోపాల్‌ను వీఆర్‌కు అటాచ్ చేస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటన పోలీసు శాఖలో తీవ్ర చర్చకు దారితీసింది.

## అక్రమ ఇసుక రవాణా.. నలుగురు అరెస్ట్

**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ముఠాను వైరా పోలీసులు పట్టుకున్నారు. నిరంతరం వాహనాల నంబర్ ప్లేట్లు మారుస్తూ పోలీసుల కళ్లు గప్పుతున్న వారిని గుర్తించి, లారీలతో పాటు ఎస్కార్ట్‌గా ఉన్న కారును స్వాధీనం చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు ఇసుక రీచ్ నుంచి హైదరాబాద్‌వైపు ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై అప్రమత్తమైన వైరా ఎస్సై పుష్పాల రామారావు ఆధ్వర్యంలోని బృందం, గురువారం రాత్రి గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమతులు లేని మూడు ఇసుక లారీలను, వాటికి ఎస్కార్ట్‌గా వస్తున్న కారును పోలీసులు గుర్తించి సీజ్ చేశారు.

## బెంగళూరుకు రెండో వందే భారత్ స్లీపర్



అక్షరటుడే, వెబ్‌డెస్క్: భారతీయ రైల్వే ప్రతిష్ఠాత్మకమైన రెండో వందే భారత్ స్లీపర్ రైలు బెంగళూరుకు చేరుకుంది. కేఎస్ఆర్ బెంగళూరు - ముంబై మధ్య నడవనున్న ఈ రైలు.. ప్రస్తుతం బెంగళూరులోని ఎస్ఎమ్ఏవీటీ స్టేషన్‌లో తుది పరీక్షల్లో ఉంది. బీఈఎమ్ఎల్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ సెమీ హై-స్పీడ్ రైలులో 16 కోచ్‌లు ఉన్నాయి.

## మూడు చైనా యాప్స్ తొలగింపు



అక్షరటుడే, ఢిల్లీ: స్మార్ట్ ఫోన్‌ను ఉపయోగించి ఈ-రిక్షాలను షట్‌డౌన్ చేస్తున్న వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. మార్గమధ్యంలో ఆటోల నిలిపివేతకు కారణమవుతున్న మూడు చైనా యాప్‌లను గుర్తించి చర్యలు చేపట్టింది. యాపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లేస్టోర్ నుంచి వాటిని తొలగింపునకు ఆదేశాలు ఇచ్చింది.

## తమిళనాడు డీఎంకే ఎమ్మెల్యే అరెస్ట్



అక్షరటుడే, తమిళనాడు : టీవీకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన డీఎంకే ఎమ్మెల్యే అనితా ఆర్.రాధాకృష్ణన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు బెయిల్ కోసం ఆయన చేసిన అభ్యర్థనను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చడంతో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

## ముంబైలో భారీ వర్షాలు

**అక్షరటుడే, ముంబై :** ముంబైలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలా ప్రాంతాలు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జూలై 2 ఉదయం 8 గంటల నుంచి జూలై 3 ఉదయం 6 గంటల మధ్య ముంబైలో భారీ వర్షపాతం నమోదైంది. మండవి ఫైర్ స్టేషన్ వద్ద అత్యధికంగా 150.2 మి.మీ వర్షం కురిసింది. వాతావరణ శాఖ ముంబైకి రాబోయే మూడు గంటల పాటు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. ముంబై, థానే, పాల్ఘర్, రాయ్‌గఢ్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు.

## రాష్ట్రానికి వర్ష సూచన

**అక్షరటుడే, హైదరాబాద్:** వానలు లేక ఆందోళన చెందుతున్న రైతులకు వాతావరణ శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. నేటి నుంచి ఈ నెల 5 వరకు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వానాకాలం ప్రారంభమై నెల దాటుతున్నా.. తెలంగాణలో చెప్పుకోదగ్గ వర్షాలు పడలేదు. దీంతో సాగు పనులు మందకొడిగా సాగున్నాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో తొలిసారి ముసురు పెడుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 100 నుంచి 120 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉంది. నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. 50 నుంచి 80 మి.మీ. వర్షం కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

## లాడ్జిలో యువతి అనుమానాస్పద మృతి

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరబాద్ నగరంలోని లంగర్ హౌజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక లాడ్జిలో రేణుక అనే 26 ఏళ్ల యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెతో పాటు ఫరూక్ అనే వ్యక్తి ఉన్నాడని, అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. రేణుక నగరంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో పని చేస్తోంది. ఆమెకు ఫరూక్ (34) అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారినట్లు సమాచారం. ఈ క్రమంలో జూలై 2వ తేదీ రేణుక, ఫరూక్ లంగర్ హౌస్ వచ్చారు. అక్కడ ఓ లాడ్జిలో రూం తీసుకున్నారు. ఆ తర్వాత రాత్రి రేణుక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఫరూక్ పోలీసులకు సమాచారం అందించాడు. రేణుక మరణాన్ని అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.



హిమగిరుల్లో కొలువుదీరిన శివుడిని దర్శించుకోవడానికి ఎంతో మంది భక్తులు ఎదురు చూస్తుంటారు. అత్యంత క్లిష్ట వాతావరణంలో నడుచుకుంటూ వెళ్లి పరమశివుడిని దర్శిం చుకుంటారు. భక్తితో మంచు లింగాన్ని చూసి తన్మయత్వం చెందుతారు. అత్యంత క్లిష్ట వాతావరణం సాగే అమర్‌నాథ్ యాత్ర శుక్రవారం ప్రారంభమైంది. దక్షిణ కాశ్మీర్ హిమాలయాల్లోని 3,800 మీటర్ల ఎత్తయిన గుహాలయం అయిన అమర్‌నాథ్‌కు, బల్తాల్ మరియు పహల్గామ్ బేస్ క్యాంపుల నుండి యాత్రికులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ బయలుదేరడంతో 57 రోజుల అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది.

—అక్షరటుడే, నేషనల్ డెస్క్

# అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

■ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు ■ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు ■ యాత్రికులకు ప్రధాని మోదీ లేఖ

పహల్గామ్ బేస్ క్యాంప్ నుంచి అనంతనాగ్ డిప్యూటీ కమిషనర్ బిలాల్ భట్ మరియు ఎస్ఎస్పి అనంతనాగ్ అమోద్ నాగ్పురే జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. యాత్ర సురక్షితంగా, సజావుగా సాగేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. యాత్ర కాన్వాయ్‌లకు పోలీసులు, పారామిలిటరీ సిబ్బంది, సైన్యం భద్రత కల్పిస్తున్నారు. యాత్రికులు నమోదు చేసుకున్న తేదీన మాత్రమే యాత్ర చేపట్టాలని జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం సూచించింది. నమోదు చేసుకున్న తేదీకి ముందు ఏ యాత్రికుడిని ప్రయాణించడానికి అనుమతించబోమని హెచ్చరించింది.

### యాత్రికులకు జీపీఎస్ ట్రాకర్లు

యాత్రికులకు వ్యక్తిగత రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ కార్డులు జారీ చేశారు. వీటిలో జీపీఎస్ ట్రాకింగ్ సామర్థ్యాలు కూడా ఉన్నాయి. దీని ద్వారా అధికారులు యాత్రికుల కదలికలను పర్యవేక్షించగలరు, అత్యవసర పరిస్థితుల్లో వారిని సంప్రదించగలరు. నిర్దేశిత కేంద్రాల నుండి వారి ప్రయాణాన్ని పర్యవేక్షించగలరు. అమర్‌నాథ్ యాత్ర చేపట్టేందుకు పెద్ద సంఖ్యలో యాత్రికులు కాశ్మీర్‌కు చేరుకున్నారు. 57 రోజుల యాత్ర ఆగష్టు 28న రక్షాబంధన్ పండుగతో ముగుస్తుంది.

### యాత్రమార్గంలో సీసీ కెమెరాలు

యాత్ర మార్గాన్ని 24 గంటలూ పర్యవేక్షించడానికి, యాత్ర మార్గంలోని కీలక ప్రదేశాలలో 416 హైరిజల్యూషన్ సీసీటీవీ కెమెరాలు మరియు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (FRS) మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థలు నిరంతర రియల్ టైం మానిటరింగ్ చేస్తాయి. యాత్రకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడానికి, లోయలో అదనంగా 670 కంపెనీల పారామిలిటరీ బలగాలను మోహరించడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది.

### ఐక్యతకు నిదర్శనం

యాత్ర మన దేశ సాంస్కృతిక ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్న ప్రధాని, భక్తుల కోసం ఐదు కీలక సంకల్పాలను పాటించాలని పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం ఎంతో కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో సాగే ఈ యాత్రను విజయవంతం చేసేందుకు భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది చేస్తున్న సేవలను ప్రధాని కొనియాడారు. యాత్రికులకు అండగా నిలుస్తున్న స్థానిక పౌరుల నిస్వార్థ గుణాన్ని ఆయన ప్రశంసించారు. ఈ మేరకు లేఖ రాశారు. అమర్‌నాథ్ యాత్రను కేవలం ఒక ఆధ్యాత్మిక ప్రయాణంగానే కాకుండా, దేశాభివృద్ధికి దోహదపడేలా మలచుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ భక్తులకు పిలుపునిచ్చారు. ఈ యాత్రలో భాగంగా భక్తులు పవిత్ర మార్గంలో పరిశుభ్రతను పాటిస్తూ స్వచ్ఛతను కాపాడాలని, భద్రతా సిబ్బంది సూచనలను గౌరవిస్తూ క్రమశిక్షణతో వ్యవహరించాలని ఆయన కోరారు.

## మరోసారి జూపల్లి సవాల్



**అక్షరటుడే, హైదరాబాద్ :** మంత్రి జూపల్లి కృష్ణారావు మరోసారి బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. ఈరోజు తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. కేటీఆర్, హరీశ్‌రావు వస్తానంటే సాయంత్రం 5 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌కు వస్తానని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులపై గురువారం చర్చకు వస్తానని జూపల్లి కృష్ణారావు సవాల్ చేసిన విషయం తెలిసిందే. అయితే చర్చకు వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావును పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో హరీశ్‌రావు మాట్లాడుతూ జూపల్లిపై తీవ్ర విమర్శలు చేశారు. సవాల్ విసిరి తోక ముడిచారన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సీఎల్పీ కార్యాలయంలో జూపల్లి మాట్లాడారు.

## మంత్రి జూపల్లి తీరుపై హరీశ్‌రావు సెటైర్లు




**అక్షరటుడే, హైదరాబాద్:** మంత్రి జూపల్లి కృష్ణారావు తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలో జరిగిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన, మంత్రిని ఉద్దేశించి "పూటకో సవాల్.. రోజుకో అడ్రస్" అంటూ ఎద్దేవా చేశారు. మంత్రి జూపల్లి సవాళ్లపై స్పందించిన హరీశ్‌రావు.. "తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పి, ఆ తర్వాత గన్‌పార్క్‌కు మారుస్తారా? మమ్మల్ని పోలీసులు అడ్డుకుంటే, ఇప్పుడు కేసీఆర్ రావాలంటూ కొత్త వాదనలు తెరపైకి తెస్తున్నారు" అని విమర్శించారు. ప్రభుత్వం డ్యామేజ్ కంట్రోల్ చేసుకునే క్రమంలోనే మంత్రి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## త్వరలో ఏపీ భవన్‌కు శంకుస్థాపన..

**అక్షరటుడే, ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనదైన ముద్ర వేయడానికి సిద్ధమైంది. రాష్ట్ర విభజన తర్వాత ఆస్తుల పంపకం ప్రక్రియ కొలిక్కి రావడంతో, ఢిల్లీలోని ఏపీ సొంత స్థలంలో అత్యాధునిక హంగులతో కొత్త భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ. 105 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇది కేవలం ఒక భవనం మాత్రమే కాదు, దేశ రాజధానిలో ఆంధ్రప్రదేశ్ పరిపాలనా కేంద్రంగా, అతిథి గృహంగా బహుముఖ సేవలను అందించనుంది. ఢిల్లీకి వచ్చే ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులందరికీ ఒకే చోట అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఏపీ సంస్కృతి, సంప్రదాయాలు ఈ భవన నిర్మాణంలో ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్లను రూపొందించారు.

## లోయలో పడిన బస్సు: 40 మంది మృతి




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ బస్సు లోయలో పడడంతో 40 మంది మృత్యువాత పడ్డారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. నైరుతి పాకిస్థాన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులతో ఉన్న ఒక బస్సు హైవే నుండి రాతి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 40 మంది మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్సుల సరిహద్దుకు సమీపంలో ఉన్న దానా సర్ అనే మారుమూల ప్రాంతంలో బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయిందని బలూచిస్తాన్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రింద్ తెలిపారు.

## మోతీనగర్‌లో హైడ్రా కూల్చివేతలు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలోని మోతీనగర్‌బోరబండ రోడ్డు సిగ్నల్ వద్ద రహదారిని ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు శుక్రవారం తొలగించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించి, రోడ్డు విస్తరణ చేపట్టడమే లక్ష్యంగా ముందుగా నోటీసులు ఇచ్చి మరీ ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు స్పష్టం చేశారు. అలాగే సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో పార్కును హైడ్రా కాపాడింది. మహాదేవపురం సర్వే నంబర్లు 213, 214లోని 655 గజాల పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేయడానికి యత్నించారు. ఈ మేరకు హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసింది.



## స్విమ్ సూట్‌లో నుస్రత్ అందాలు

నటి, రాజకీయవేత్త నుస్రత్ జహాన్ గులాబీ రంగు స్విమ్‌వేర్ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. 36 ఏళ్ల ఈ నటి తన గ్లామరస్ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే స్టైలిష్ లుక్‌లో ఉన్న ఈ ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. సినీరంగం, ప్రజా జీవితం రెండింటినీ సమతుల్యం చేయడంలో పేరుగాంచిన నుస్రత్, తన ఫ్యాషన్ ఎంపికలు మరియు బలమైన తెరపై ఉనికితో నిరంతరం వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. ఆమె నుస్రత్ బెంగాలీ చిత్రసీమలో తన నటనకు విస్తృతంగా గుర్తింపు పొందారు. —అక్షరటుడే, సినిమాడెస్క్